www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 ఏప్రిల్ 2025



15 రోజులకే వేతనాలు చెల్లించాలి : వ్యకాస

తాడేపల్లిగూడెం:ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు 15 రోజులకే వేతనాలు చెల్లించాల్సి ఉన్నా ఎక్కడా ఆ విధంగా చెల్లింపులు జరగడం లేదని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు అన్నారు. బుధవారం ఉప్పరగూడెంలో ఉపాధి పని ప్రదేశంలో ఆయన పర్యటించారు. ఆయన వద్ద తమకు వేతనాలు నెలలు తరబడి రావడం లేదని, తాము ఎలా బతకాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతుంటే, మరోపక్క సర్దుబాటు పేరుతో విద్యుత్ బిల్లులు అదనంగా వచ్చి పడుతున్నాయని తెలిపారు. సోమరాజు మాట్లాడుతూ వేతన బకాయిలు చట్టంలో ఉన్న ప్రకారం 15 రోజులకే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణం చట్టంలో ఉన్న ప్రకారం వేతనాలివ్వాలని, విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దండే వెంకన్న, ఏలూరు వెంకయ్యమ్మ, మరపట్ల పవిత్ర, ఎదపల్లి వేణు, సిహెచ్.సుజాత, కప్పల మేరీకుమారి, నత్త రాధ, డి.బేబీరాణి, ఎం.సుబ్బారావు, ఎం.వెంకట్రావు, దండే చిన్న గోతియ్య మాట్లాడారు.

'పది'లో బాలికలదే హవా..!

82.15 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో పశ్చిమకు 16వ స్థానం
గతేడాది ఫలితాలతో పోలిస్తే మెరుగు



ప్రజాశక్తి - భీమవరం

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పశ్చిమ విద్యార్థులు సత్తా చాటారు. బాలురకన్నా బాలికలే పైచేయిగా నిలిచి హవా కొనసాగించారు. ఈ విద్యా సంవత్సరం మార్చి 17 నుండి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 21,539 మంది విద్యార్థులు హాజరవ్వగా వారిలో 17,695 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లావ్యాప్తంగా 82.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. నూరుశాతం ఉత్తీర్ణతతో నాలుగు ప్రభుత్వ పాఠశాలలు నిలిచాయి. 500కుపైగా మార్కుల ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 1,485 మంది ఉన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో పశ్చిమగోదావరి జిల్లాకు 23వ స్థానం, ఈ ఏడాది 16వ స్థానానికి చేరుకుంది. అయితే తేడాతో పోలిస్తే ఫలితాలు మరింత మెరుగుపడ్డాయి. ఉపాధ్యాయుల సమన్వయం, అధికారుల ముందస్తు ప్రణాళికతో మెరుగైన ఫలితాలు సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ తెలిపారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, ఉపాధ్యాయ సిబ్బందిని విద్యాశాఖాధికారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు డిఇఒ నారాయణ ప్రకటించారు.

ప్రభుత్వ పాఠశాలలో 77.09 శాతం ఉత్తీర్ణత

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత గతంతో పోలిస్తే మెరుగుపడింది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 12,610 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలురు 5,991 మంది, బాలికలు 6,619 మంది ఉన్నారు. ఈ పరీక్షల్లో బాలురు 3,910 మంది, బాలికలు 5,180 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణతా శాతం బాలురు 65.26, బాలికలు 78.26 శాతంగా నమోదైంది. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం ఉత్తీర్ణతా శాతం 72.09గా నమోదైంది.

రాణించిన ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు

జిల్లాలో ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు ఫలితాల్లో రాణించి తమకు తామే సాటి అని మరోసారి నిరూపించుకున్నారు. జిల్లాలో 8,929 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలురు 4,933 మంది, బాలికలు 3,996 మంది ఉన్నారు. ఉత్తీర్ణత సాధించిన వారిలో బాలురు 4,702 మంది, బాలికలు 3,903 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణతా శాతం బాలురు 95.32, బాలికలు 97.67 శాతంగా ఉంది. ప్రయివేటు పాఠశాలల్లో మొత్తం ఉత్తీర్ణతా శాతం 96.37గా నమోదైంది.

ఉగ్రవాదుల దాడిపై సిపిఎం నిరసన

ఉగ్రవాదుల చర్యలకు కేంద్రం బాధ్యత వహించాలి
సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం


నిరసన తెలియజేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడులకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం చౌక్లో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ గత 20, 30 ఏళ్ల నుండి కాశ్మీర్లో అరాచకాలకు పాల్పడుతున్న ఉగ్రవాదులు తమ ఉనికిని చాటేందుకు పర్యాటకులపై తెగబడ్డారన్నారు. జమ్మూకాశ్మీర్లో ఉగ్రవాదం లేకుండా చేశాం, కూకటివేళ్లతో పీకి పడేశామని కేంద్రం ప్రకటించడంతో నమ్మిన ప్రజలు కాశ్మీర్కు పర్యటనకు వెళ్లి మృత్యువాతపడ్డారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్ మాట్లాడుతూ కాశ్మీర్లో ఉగ్రవాద చర్య చాలా బాధాకరం, హేయమైన చర్యని అన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, నేతలు ఎం.వైకుంఠరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఇంజేటి శ్రీను, మల్లిపూడి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్ఆర్ నగర్లో భోజన శిబిరం ప్రారంభం

నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకునే వరకు భోజనం అందిస్తాం
సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం


నిరుపేదలకు భోజనం పంపిణీ చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు ఎస్ఆర్ నగర్లో ఇళ్ల కూల్చివేతతో రోడ్డున పడ్డ నిర్వాసితులకు సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి భోజన శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర సీనియర్ నేత మంతెన సీతారాం ప్రారంభించి మాట్లాడారు. నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకునే వరకు ఈ శిబిరాన్ని కొనసాగిస్తామన్నారు. ఇళ్ల కూల్చివేతతో రోడ్డున పడిన ప్రజలను అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ కనీసం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. గూడు లేక, తిండి లేక, వృద్ధులు, చిన్నారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి తక్షణం పునరావాసం కల్పించాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్ మాట్లాడుతూ కూల్చేసిన ఇళ్లను తిరిగి నిర్మించే వరకూ పోరాడుతామని స్పష్టం చేశారు. పేదలను నడిరోడ్డుపైన ఉంచినా అన్ని రోజులూ సిపిఎం ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, కె.క్రాంతిబాబు, మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య, నాయకులు దున్నా మరియమ్మ, పాలా వెంకటస్వామి, బాధితులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు సంభవిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ నాగరాణి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మాతా శిశుమరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన మాతా, శిశు మరణాలపై సంబంధిత కమిటీ సభ్యులు బాధిత కుటుంబాల సమక్షంలో వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో స్త్రీ పాత్ర కీలకమైందన్నారు. ఏ తల్లీ బిడ్డకు జన్మనిచ్చి చనిపోకూడదని, జన్మించిన ప్రతిబిడ్డా ఆరోగ్యంగా పెరిగేందుకు వైద్యుల కృషి ఎంతో అవసరమని తెలిపారు. తాను జిల్లా కలెక్టర్గా ఛార్జి తీసుకున్ననాటి నుంచి ప్రతినెలా వైద్య, ఆరోగ్య, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలను సమీక్షిస్తున్నాని, క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేస్తూనే ఉన్నా మాతా, శిశు మరణాల కేసులు ఎందుకు నమోదు అవుతున్నాయనని ప్రశ్నించారు. 2024 - 25లో జిల్లాలో మొత్తం ఎనిమిది మాతృ మరణాలు, 88 శిశు మరణాలు సంభవించాయని తెలిపారు. సమావేశంలో డిఎంహెచ్ఒ జి.గీతాబాయి, కమిటీ సభ్యులు ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, డిసిహెచ్ఎస్ ఎం.సూర్యనారాయణ, డిఎఒ డాక్టర్ దేవ సుధాలక్ష్మి, గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి కళ్యాణి, ఫిజీషియన్ డాక్టర్ సి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు వెంటనే చేపట్టాలి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

వేల్పూరు 10వ వార్డులో శిథిలావస్థలో ఉన్న కల్వర్ట్ మరమ్మతు పనులు తక్షణం చేపట్టాలని సిపిఎం గ్రామ కమిటీ డిమాండ్ చేసింది. సిపిఎం ఆధ్వర్యంలో ప్రజల వద్ద సంతకాలు సేకరించి సమస్యకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యదర్శి సుంకర రత్నమాలికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ సాలిపేట 10వ వార్డులో సప్పరపు కనక లింగేశ్వరరావు ఇంటి సమీపంలోని కల్వర్టు శిథిలావస్థకు చేరుకుని పైపెచ్చులు ఊడిపోయి ఐరన్ ఊసలు ప్రమాదకరంగా మారడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణం స్పందించి శిథిలావస్థలో ఉన్న కల్వర్టు పున:నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, కుడకా వీరభద్రరావు పాల్గొన్నారు.

అవార్డులు బాధ్యత మరింత పెంచుతాయ్ : ఎంఎల్ఎ

డిఎస్పి జయసూర్యకు సత్కారం


డిఎస్పి జయసూర్యను సత్కరిస్తున్న ఎంఎల్ఎ


ప్రజాశక్తి - భీమవరం టౌన్

పదవులు, అవార్డులు బాధ్యతలను మరింత పెంచుతాయని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఇటీవల సూట్కేస్లో డెడ్బాడీ కేసు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసును ఎంతో చాక చక్యంగా ఛేదించడంతో రాష్ట్రస్థాయిలో భీమవరం పోలీస్ శాఖకు ఎబిసిడి అవార్డు వచ్చింది. బుధవారం స్థానిక టుటౌన్లో ఎస్ఎస్వి.శివభద్ర గౌరీ అపార్ట్మెంట్లో ప్రముఖ తారకరామ కన్స్ట్రక్షన్ ఛైర్మన్ పళ్ల ఏసుబాబు ఆధ్వర్యంలో డిఎస్పి ఆర్.జయసూర్యను ఎంఎల్ఎ అంజిబాబు అధ్యక్షతన సత్కరించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్లో ఉన్న పెద్దలతో పాటు పట్టణంలోని పలువురు డాక్టర్లు, యిర్రింకి నరేష్, యిర్రింకి లక్ష్మి, చుండూరి రంగారావు, గొట్టుముక్కల బాలకృష్ణ, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, గొట్టుముక్కల భారత్ కుమార్, సిఐలు అభినందనలు తెలిపారు.

ధాన్యం తూకంలో మోసాలు అరికట్టాలి

పాలకొల్లు :జిల్లాలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేసినా తూకాలు, తేమశాతం పేరుతో మోసాలు ఆగడం లేదని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. ధాన్యం కొనుగోలు సమస్యలపై ఆయన మండలంలోని చందపర్రు, ఆగర్రు, అగర్తిపాలెం, సగంచెరువు, దిగమర్రు భగ్గేశ్వరం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తూనికలప్పుడు సంచితో కలిపి 40 కేజీల 600 గ్రాములు తూయాల్సి ఉన్నా అదనంగా 700 గ్రాములు తూస్తున్నారన్నారు. దీంతో 100 సార మూటలకు 70 కేజీల ధాన్యం నష్టపోతున్నారన్నారు. తక్షణం మిల్లర్ల దోపిడీని అరికట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలురైతులు ఎం.వెంకట్రావు, కె.చిట్టిబాబు, బి.ప్రభాకర్, కె.సాయి, జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

గోదావరిలో జారిపడి ఉపాధి కూలీ మృతి


మృతుడు సత్యనారాయణ (ఫైల్ఫొటో)

ఆచంట:వశిష్ట గోదావరిలో ప్రమాదవశాత్తూ పడి ఉపాధి కూలీ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆచంట మండలం కరుగోరుమిల్లి పంచాయతీ పరిధి ముత్యాల వారిపాలెం గ్రామానికి చెందిన ముత్యాల సత్యనారాయణ (70) ప్రమాదవశాత్తూ వశిష్ట గోదావరిలో పడి మృతి చెందాడు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. మృతుడు ముత్యాల సత్యనారాయణ మంగళవారం ఉదయం ఉపాధి హామీ పని నిమిత్తం కోడేరులంక గ్రామానికి వెళ్లారు. పని ముగించుకొని మధ్యాహ్న సమయంలో మార్గమధ్యలో స్నానం చేసేందుకు వశిష్ట గోదావరిలో దిగి గల్లంతయ్యాడు. సత్యనారాయణ ఇంకా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది చుట్టుపక్కలా వెతికారు. బుధవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా లంకల గన్నవరం పుష్కరరేవులో మృతదేహం ఉందనే సమాచారంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా సత్యనారాయణ అని నిర్ధారించారు. గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాసుపత్రి తరలించారు.

బాధిత కార్మికులను ఆదుకోవాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్వి.గోపాలన్


కార్మికులను పరామర్శిస్తున్న సిఐటియు బృందం

భీమవరం :మోగల్లు వశిష్ట ఆక్వా పరిశ్రమలో ప్రమాదానికి గురైన కార్మికులను తక్షణం ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్వి.గోపాలన్ అన్నారు. భీమవరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను సిఐటియు ప్రతినిధి బృందం బుధవారం పరామర్శించింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటికి పరిష్కారం చూపించాల్సిన పరిశ్రమల యాజమాన్యం గానీ, ప్రభుత్వ అధికారులు గానీ పట్టించుకోవడం లేదని అన్నారు. వలస కార్మికులకు ఉన్న చట్టాన్ని అమలు చేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ నిరంతరం జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆక్వా యూనియన్ ప్రెసిడెంట్ ఎస్కె.భాష, సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

వాణీ విజయభేరి


కోమలి ప్రియాంక

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో వాణీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని మాదాసు కోమలి ప్రియాంక 600 మార్కులకు గాను 590 టౌన్ రికార్డు సాధించినట్లు వాణి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు గ్రహీత వాణీకృష్ణ తెలిపారు. పది పరీక్షలకు 33 మంది విద్యార్థులు హాజరవ్వగా, 550 మార్కులకు పైబడి 8 మంది, 500లకు పైబడి 12 మంది, 450లకు పైబడి 10 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

గురుకుల పాఠశాల విద్యార్థినుల విజయకేతనం


ప్రథమ స్థానంలో నిలిచిన ఆర్.అశ్విని

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని లక్ష్మణేశ్వరం నక్కావారిపేట మహాత్మా జ్యోతి బాపులే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు) విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపారు. ప్రభుత్వ పాఠశాల తరపున రావి అశ్విని 592 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ కె.శైలజ తెలిపారు. మొత్తం 76 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 75 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 34 మందికి 500లకు పైబడి మార్కులు వచ్చాయన్నారు. టి.ధనలక్ష్మి, కె.సువర్ణ హాసిని 570 మార్కులు సాధించారని తెలిపారు. జి.వాణి 562, ఎంఎన్.తిరుమలరాణి 556 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంఇఒ పి.పుష్పరాజ్యం, ప్రిన్సిపల్ శైలజ, ఉపాధ్యాయులు, సిఆర్పి ఆనంద్ అభినందించారు.

రూ.390 కోట్లు ధాన్యం సొమ్ము జమ

ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే సొమ్ము చెల్లింపు
రైతులకు 82 లక్షల సంచులు అందజేత
పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్


రైతులకు వద్ద వెళ్లి ధాన్యం పరిశీలిస్తున్న డిఎం

ప్రజాశక్తి - అత్తిలి, ఇరగవరం

ఇప్పటి వరకూ జిల్లాలో 261 రైతుసేవా కేంద్రాల ద్వారా లక్షా 82 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, అందుకు సంబంధించి రూ.390 కోట్లు నగదును రైతుల ఖాతాల్లో జమ చేశామని, ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపే సొమ్ము చెల్లింపులు పూర్తవుతున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్ తెలిపారు. బుధవారం అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల్లో ఆయన పర్యటించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి అక్కడ ట్రక్షీట్, ఫండ్ ట్రాన్స్ఫర్ ఆర్డర్ తగిన సమయంలో చేస్తున్నారో, లేదో పరిశీలించారు. తర్వాత ఇరగవరం మండలంలోని రైసుమిల్లులకు వెళ్లి వారికి ఇచ్చినటు వంటి టార్గెట్కు అనుగుణంగా సంచులను రైతుసేవా కేంద్రాలకు వెంటనే అందజేయాలని తెలిపారు. వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకుని ఆన్లైన్లో ధ్రువీకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ ఇప్పటి వరకూ జిల్లాలో మొత్తం 82,06,272 గోనె సంచులను రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 45.50 లక్షల సంచులను ధాన్యం కొనుగోలుకు రైతులు వినియోగించగా, ఇంకా 36 లక్షలకుపైగా సంచులు రైతుల వద్ద ఉన్నాయని తెలిపారు. గోనె సంచులకు సంబంధించి జిల్లాలో ఎటువంటి ఇబ్బందీ లేదన్నారు. జిల్లాలో మొత్తం 3,480 మంది హమాలీలు ధాన్యం కొనుగోలు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ధాన్యం రవాణాకు 3,416 వాహనాలను రిజిస్ట్రేషన్ చేసి ఎటువంటి ఇబ్బందులూ లేకుండా జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి కమిటీల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. కిందిస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా ధాన్యం కంట్రోల్ రూమ్ నెంబర్ 8121676653కు తెలిపితే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రతి రైతు నుంచి పూర్తిగా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. ప్రతి క్వింటాకు సాధారణ రకానికి రూ.2,300, గ్రేడ్ ఎ రకానికి రూ.2,320 చొప్పున అందించడం జరుగుతుందన్నారు. మొత్తం 348 రైతుసేవా కేంద్రాలను ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రాథమిక అంచనా కింద ప్రస్తుతం ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరగవరం మండల వ్యవసాయాధికారి రఘునాథ్ పాల్గొన్నారు.

తిరుమల విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న తిరుమల యాజమాన్యం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పది ఫలితాల్లో భీమవరం తిరుమల ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వై.లాస్యశ్రీసాయి 597 మార్కులతో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, ఎజె.లక్ష్మీదివ్య 595, బిఎస్.జెనీధ 594 మార్కులు సాధించారు. జిఎస్ఎన్వి.సాయిసృజిత్, పి.సుదీప్తి, సిహెచ్.ధృతిశ్రీ, వి.పద్మ సాహితి, కె.కార్తీక, కె.జహ్నవి 592 మార్కులు, జిపి.తేజకుమార్, కె.అవినాష్ 591, వై.తేజసాయి వంశీ, ఎన్.పూజిత 590 మార్కులు సాధించారని తెలిపారు. 590కిపైగా మార్కులు సాధించినవారు 14 మంది, 585కిపైగా సాధించిన వారు 44 మంది, 580కిపైగా సాధించిన వారు 84 మంది, 570కి పైగా సాధించిన వారు 170 మంది, 560కి పైగా సాధించిన వారు 244 మంది, 550కి పైగా సాధించిన వారు 293 మంది, 540కి పైగా సాధించిన వారు 342 మంది, 530కి పైగా సాధించిన వారు 388 మంది, 500లకుపైగా సాధించిన వారు 486 మంది ఉన్నారని తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్లు ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్బాబు మాట్లాడుతూ 596 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వారికి అభినందనలు తెలిపారు.

శ్రీసూర్య విద్యార్థుల హవా


విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

పది ఫలితాల్లో ప్రతిభ చూపిన శ్రీసూర్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులను ఆర్డిఒ దాసిరాజు అభినందించారు. 600 మార్కులకు 500 మార్కులుపైగా సాధించిన విద్యార్థులు 17 మంది ఉన్నారని తెలిపారు. ద్వార అమత మణి 593, అందే ప్రసన్న 588, పులపర్తి హిమహాసిని 587, పొన్నపల్లి హితేష్ కుమార్ 575, జనపరెడ్డి లిఖిత ఆదిత్య 574, రావూరి నిఖిల హరిప్రియ 569, కడలి సిరి చంద్రిక 569, మండెల లోహిత మహాలక్ష్మి 567, బోణం గణేష్ శశివరుణ్ 561 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే కారుమూరి రంగప్రియ 560, చింతా హంసిని 552, చింతా గిరీష్ సత్య 546, అందే భవ్య మనుశ్రీ 544, చామకూరి మంజుశ్రీ 543, వడ్డీ లీలా సుబ్రహ్మణ్యం 531, మాంద్రు సేతు 514, గన్నాబత్తుల తనుశ్రీ 508 మార్కులతోపాటు పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థీ ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో కూడా ఎక్కువ మంది విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించినట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. మంచి ర్యాంకులు సాధిస్తున్న శ్రీసూర్య విద్యా సంస్థల యాజమాన్యాన్ని అభినందిస్తున్నామని తెలిపారు. అలాగే విద్యా సంస్థల ఛైర్మన్ ఘంటసాల సూర్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, కళాశాల అకడమిక్ అడ్వయిజర్ బి.రామచంద్రరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఘంటసాల హేమవల్లి, ప్రిన్సిపల్ ఆర్.సతీష్, ఎఒ పి.శ్రీనివాస్ తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

రూట్స్ విద్యార్థుల ప్రభంజనం



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న రూట్స్ డైరెక్టర్లు

ప్రజాశక్తి - తణుకు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి విజయకేతనం ఎగుర వేశారని స్కూల్ ప్రిన్సిపల్ ఎల్కె.త్రిపాఠి తెలిపారు. ఈ సందర్భంగా త్రిపాఠి మాట్లాడుతూ పరీక్షకు హాజరైన 183 మంది విద్యార్థుల్లో యు.హన్సితపద్మిని 596 మార్కులు సాధించి తణుకు టౌన్ఫస్ట్గా నిలిచింది. పి.మోహన్య 591, వై.నీరజాషైనీ 590 మార్కులు సాధించారు. 580 మార్కులకు పైగా 17 మంది విద్యార్థులు, 570కి పైగా 36 మంది విద్యార్థులు, 560కి పైగా 59 మంది విద్యార్థులు, 550కి పైగా 69 మంది, 500లకు పైగా 123 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. మ్యాథ్స్లో 100/100 సాధించిన విద్యార్థులు 34 మంది, సైన్స్లో 100/100 సాధించిన విద్యార్థులు ఆరుగురు, తెలుగు, సాంఘిక శాస్త్రంలో 100/100 సాధించిన విద్యార్థులు నలుగురు ఉన్నారు. స్కూల్ ఆవరేజ్ మార్కులు 512 సాధించి తణుకు పట్టణంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ ఎల్కె.త్రిపాఠి మాట్లాడుతూ అనుభవం, అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయ బృందం, అవగాహనతో కూడిన విద్యనందించడం వల్ల ఇంతటి ఘన విజయం రూట్స్కు సాధ్యమైందని తెలిపారు. స్కూల్ టాపర్స్గా నిలిచిన విద్యార్థులను డైరెక్టర్లు సత్కరించారు. ఇంతటి ఘన విజయానికి కారణమైన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు సంస్థ డైరెక్టర్స్ ఎల్కె.త్రిపాఠి, బి.విద్యాకాంత్, ఎన్.సుధాకర్వర్మ అభినందనలు తెలిపారు.

'భీమవరం'లో 2,082 మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పది పరీక్షా ఫలితాల్లో భీమవరం పట్టణంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 2,296 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 2,082 మంది ఉత్తీర్ణత సాధించారని, 214 మంది ఫెయిల్ అయ్యారని ఎంఇఒ-1 నక్క శ్రీనివాస్, ఎంఇఒ-2 వేండ్ర వెంకటేశ్వరరావు తెలిపారు. భీమవరం మండలంలో 20 ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుండి 859 మంది విద్యార్థులకు 749 మంది ఉత్తీర్ణ సాధించగా, 110 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు తెలిపారు. తిరుమల హైస్కూల్ విద్యార్థిని ఏలూరి లాస్య శ్రీసాయి 597 మార్కులతో టౌన్ ఫస్ట్గా నిలిచింది. భాష్యం స్కూల్ విద్యార్థిని ఎం.కాత్యశ్రీ, మేడపాటి శ్రేష్ట పట్టణస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. మండలస్థాయిలో చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థిని జి.రేణుకాలక్ష్మీ భవాని, పి.కీర్తన 595 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు.

కొణితివాడ హైస్కూల్లో 90 శాతం ఉత్తీర్ణత

వీరవాసరం : పది పరీక్షల్లో కొణితివాడ హైస్కూల్ 90 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో ప్రభుత్వ పాఠశాలల పరిధిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ హైస్కూల్లో 94 మంది పది పరీక్షలు రాయగా 85 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇదే హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని జి.వర్షిణి 579 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాయకుదురు హైస్కూల్ 88 శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ స్థానం, తోలేరు హైస్కూల్ 84 ఉత్తీర్ణతతో తృతీయ స్థానం సాధించాయి. మండలంలో అత్యధిక మార్కులు సాధించిన వర్షిణిని ఎంఇఒ శ్రీమన్నారాయణ, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, సర్పంచి వీరవల్లి లక్ష్మి, జనసేన మండల ఉపాధ్యక్షుడు యడకరాజు హరిబాబులు అభినందించారు.


జి.వర్షిణి

మండల ప్రథమ స్థానంలో సెయింట్ మేరీస్ పాఠశాల

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఉన్న ఐదు ప్రయివేట్ జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లోని 156/148 (95 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఇఒ యు.శామ్యూల్ తెలిపారు. కాళీపట్నంలో ఉన్న సెయింట్ మేరీస్ పాఠశాల 30/25 విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వేంద్ర హారిక 595 మార్కులతో మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 35/35 నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. లీలా మాధురి 585 మార్కులతో మండల ద్వితీయ స్థానం సాధించింది. మొగల్తూరులోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 51/49 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కొల్లాటి చైతన్యశ్రీ 573 మార్కులతో మండల తృతీయ స్థానం సాధించింది. కేపీ పాలెంలోని సెయింట్ డోమినిక్ 30/30 విద్యార్థులు నూరు శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కొండవీటి మౌనిక శ్రీవల్లి 560 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. మొగల్తూరులోని శ్రీగౌతమి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 10/9 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కవురు మేఘన 508 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ఎంఇఒ అభినందించారు.


వేంద్ర హారిక

జెడ్‌పి హైస్కూల్లో 81 శాతం ఉత్తీర్ణత

గణపవరం : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో గణపవరం జిల్లాపరిషత్ బాలుర హైస్కూల్లో 81 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు హైస్కూలు హెచ్ఎం క్రొవ్విడి శర్మ బుధవారం తెలిపారు. పరీక్షల్లో వంద మంది పాల్గొన్నారని, వారిలో 81 మంది పాసైనట్లు చెప్పారు. వీరిలో పెరవలి రామచరణ్ 571 మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. పైలా భువనచంద్ర 561 సాధించి ద్వితీయ స్థానం, యర్రా సత్యప్రసాద్ 552 మార్కులు సాధించి మూడవ స్థానం సాధించినట్లు చెప్పారు.

దండగర్ర హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ : దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 84 శాతం పాస్ అయ్యారని పాఠశాల హెచ్ఎం సిహెచ్.చంద్రశేఖర్ తెలియజేశారు. పాఠశాల స్థాయిలో మరపట్ల రత్నకుమారి 567(ప్రథమ), మరపట్ల రూప్సి 557(ద్వితీయ), దండే గోపీచంద్ 525(తృతీయ) స్థానాలు సాధించారు. విజేతలను సర్పంచి పిల్లా రాంబాబు, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ మరపట్ల పండయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

మండలంలో 84 శాతం ఉత్తీర్ణత

తణుకు రూరల్ : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తణుకు మండలంలో 84 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు సర్వాపురం ఉపవిద్య శాఖ అధికారి డి.మురళీ సత్యనారాయణ తెలిపారు. బాలురు 1,324 మంది హాజరు కాగా 1091 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 1256 మంది హాజరు కాగా 1089 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 2,580 మందికి గాను 2180 ఉత్తీర్ణత సాధించగా 400 మంది పరీక్ష తప్పినట్లు ఆయన తెలిపారు.

మాంటిస్సోరి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

తణుకు : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు మొత్తం 199 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో టి.జగీషామల్లు 594/600 మార్కులతో అత్యున్నత విజయాన్ని సాధించిందని స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలియజేశారు. ఈ సందర్భంగా అనపర్తి ప్రకాశరావు మాట్లాడుతూ 580కి పైగా మార్కులు సాధించిన వారు 11 మంది విద్యార్థులు కాగా 550కి పైగా మార్కులు సాధించినవారు 73 మంది విద్యార్థులు అని తెలిపారు.

జెడ్‌పిహెచ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం : 2025 ఎస్ఎస్‌సి ఫలితాల్లో కె.ఆదిత్య మణికంఠ 577 మార్కులతో స్కూల్ ఫస్ట్ ర్యాంక్, 572 ఎం.లక్ష్మీ వెంకట శివ స్కూల్ సెకండ్, 559 మార్కులతో పి.యామిని ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల హెచ్ఎం ఎం.సత్యనారాయణ తెలిపారు. మొత్తం 161 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 98 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపారు. వీరిలో 14 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. 67 మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలోను, 23 మంది ద్వితీయ, ఎనిమిది మంది విద్యార్థులు తృతీయ శ్రేణిలో పాస్ అయినట్లు తెలిపారు.


ఆదిత్య మణికంఠ

శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రభంజనం

భీమవరం టౌన్ : పదవ తరగతి పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని శ్రీవిద్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వి.లక్ష్మీ భవాని తెలిపారు. తమ స్కూల్ నుంచి 30 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, వారిలో 18 మందికి 500 మార్కులకుపైగా సాధించి వంద శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 581 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన జి.భాస్కర్‌ను ఆమె అభినందించారు.

జెడ్‌పి పాఠశాలల విద్యార్థుల సత్తా

పెనుగొండ : మండలంలోని జెడ్‌పిహెచ్ పాఠశాల వడలికి చెందిన వీరవాసరపు భాస్కర సత్య అవినాష్ 577 సాధించారు. ఎపి గురుకుల పాఠశాల బాలికలు ఉన్న పాఠశాలలో 556 మన్నె బుల్లి తిరుపతి రాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుడిపూడి భవ్యశ్రీ 553, ప్రభుత్వ పాఠశాలలో 65 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో 425 మంది పాస్ అయ్యారు, 25 మంది ఫెయిలయ్యారని విద్యాశాఖ అధికారి తెలిపారు.

బాలికల హవా

గణపవరం : జిల్లా పరిషత్ హైస్కూలు బాలికలు 86 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హైస్కూల్ హెచ్ఎం బాల భాస్కరరావు బుధవారం తెలిపారు. పది ఫలితాల్లో పిల్లా పూజిత 573 మార్కులు సాధించి ప్రథమస్థానం సాధించినట్లు చెప్పారు. పోతల మౌనిక 571 సాధించి రెండవ స్థానం, ముసినాని నిఖిలశ్రీ 567 మార్కులతో మూడవ స్థానం సాధించినట్లు చెప్పారు. ఇంగ్లీష్ మీడియంలో 97 శాతం, తెలుగు మీడియంలో 55 శాతం మొత్తం 86 శాతం ఉత్తీర్ణత సాధించారు. 500 మార్కులుకంటే ఎక్కువ మార్కులు సాధించినవారు 16 మంది ఉన్నారని తెలిపారు.


పిల్లా పూజిత

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

పాలకోడేరు : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బెజవాడ ప్రవల్లికశ్రీ 577 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రవల్లికశ్రీని గ్రామంలోని పలువురు అభినందించారు. కుమదవల్లి క్షత్రియ బాలికల మఠ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి బి.ఇందుశ్రీ 597, విస్సాకోడేరు సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థి సిహెచ్.పూజిత వాగ్దేవి 546 మార్కులు సాధించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 65 శాతం ఉత్తీర్ణత సాధించారు. 11 ఉన్నత పాఠశాలలకు సంబంధించి 520 మంది పరీక్షలకు హాజరు కాగా 338 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 252 మందికి 136 మంది, బాలికలు 268 మందికి 202 మంది ఉత్తీర్ణులయ్యారు. గొరగనమూడి ఉన్నత పాఠశాల 89 శాతం ఉత్తీర్ణతతో మండలంలో మొదటి స్థానంలో నిలవగా, 38 శాతం ఉత్తీర్ణతతో పాలకోడేరు బాలికల ఎయిడెడ్ పాఠశాల ఆఖరి స్థానంలో నిలిచింది. 577 మార్కులతో పాలకోడేరు విద్యార్థిని బెజవాడ ప్రవల్లికశ్రీ మండలంలోనే ప్రథమస్థానం, 572 మార్కులతో కేతా సుమ (వేండ్ర), 570 మార్కులతో కె.తేజస్విని (విస్సాకోడేరు) ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

శానిటేషన్ పనుల పరిశీలన

నరసాపురం: పట్టణ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. వార్డుల్లో శానిటేషన్ పనులు, బ్లీచింగ్, మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. డిఇ రవిచంద్ర, ఎఇ దుర్గా కిశోర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

రూరల్‌లో వైశాలి ప్రథమం

పాలకొల్లు రూరల్ : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లంకలకోడేరులో చదువుతున్న బిశెట్టి వైశాలి 583 మార్కులు సాధించి పాలకొల్లు రూరల్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని హెచ్ఎం పి.భాగ్యలక్ష్మి తెలియజేశారు. విద్యార్థిని గవరపేట గ్రామం నుంచి ప్రతిరోజు సైకిల్‌పై స్కూలుకు వస్తుంది. తండ్రి బిశెట్టి సత్యనారాయణ చిరు వ్యాపారి, తల్లి లక్ష్మి గృహిణి అతి సాధారణ కుటుంబం. వైశాలి అత్యధిక మార్కులతో పాస్ కావడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎం పి.భాగ్యలక్ష్మి, ప్రథమ సహాయకులు గొల్ల జనార్ధన్ రావు, స్టాఫ్ సెక్రెటరీ ఐవిఎన్.రాజు, ఉపాధ్యాయులు పెనుమత్స అప్పలరాజు, విద్యా కమిటీ ఛైర్మన్ ఇ.రామకృష్ణ, సిబ్బంది వైశాలికి అభినందనలు తెలియజేశారు.



మార్టేరు వివేకానంద విద్యార్థుల సత్తా

పెనుమంట్ర : మార్టేరు వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల పదవ తరగతి ఫలితాల్లో మండలం ఒకటి, రెండు స్థానాలు పొందింది. సిహెచ్.ప్రణీత 589 మార్కులతో ప్రథమ స్థానం, కె.సింధు భవిత 582 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు స్కూల్ డైరెక్టర్ గుడిమెట్ల రామారెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో వంద శాతం విద్యార్థులు పాస్ అయ్యారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ప్రయివేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ నుంచి వెలగలేరు(మార్టేరు)లోని శ్రీసంఘమిత్ర స్కూల్‌కు చెందిన చిర్ల శ్రీజనని 579 మార్కులు, దొంగ భార్గవి మండలం తృతీయ స్థానం పొందారు. ఈ స్కూల్ నుంచి 94 శాతం విద్యార్థులు పాస్ అయినట్లు ప్రిన్సిపల్ ఆచారి తెలిపారు. మొత్తంగా ఈసారి పెనుమంట్ర విజయ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 91 శాతం, వెలగలేరు విద్యార్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 96 శాతం ఫలితాలు సాధించాయి.



సిహెచ్.ప్రణీత
కె.సింధు భవిత

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు..

ఈసారి మండలంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం జుత్తిగ జెడ్‌పి హై స్కూల్ నుంచి కండెల్లి జ్యోత్స్న(578), ద్వితీయ, తృతీయ స్థానాలు పొలమూరు జెడ్‌పి హై స్కూల్ నుంచి డి.దుర్గా తులసి(577), పిల్లి రత్నశ్రీ(568) పొందారని ఎంఇఒలు వై.లక్ష్మీ నారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు.

నరసాపురంలో 69.48 శాతం ఉత్తీర్ణత

నరసాపురం: పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత 69.48 శాతం వచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారి పి.పుష్పరాజ్యం తెలిపారు. మొత్తం 24 స్కూల్లో 1,208 విద్యార్థులకు గానూ 838 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్‌లో మహాత్మ జ్యోతి బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) విద్యార్థి రావి అశ్విని 592, జెడ్‌పి హై స్కూల్స్‌లో యర్రంశెట్టి వారి పాలెం హై స్కూల్ విద్యార్థి తెలగంశెట్టి దీప్తి 580 మార్కులు, మున్సిపల్ హై స్కూల్స్‌లో టైలర్ పేట మున్సిపల్ హై స్కూల్ విద్యార్థి మహమ్మద్ నజియా 576, ఎయిడెడ్ స్కూల్స్‌లో మిషన్ హై స్కూల్ విద్యార్థి కె.శ్రావ్య 549 మార్కులు సాధించినట్లు ఎంఇఒ పుష్పరాజ్యం తెలిపారు.


తెలగంశెట్టి దీప్తి


ప్రథమ స్థానం సాధించిన లిఖితను అభినందిస్తున్న యాజమాన్యం

కోపల్లె హైస్కూల్ విద్యార్థి మండల ఫస్ట్

కాళ్ల : పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో కోపల్లె జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 76 శాతం ఫలితాలు సాధించారని ప్రధానోపాధ్యాయులు కె.నిర్మలాదేవి బుధవారం తెలిపారు. పాఠశాల విద్యార్థిని సాధనల లిఖిత దుర్గ 586/600 మార్కులు సాధించి మండలం ఫస్ట్ నిలిచింది. 118 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 90 మంది విద్యార్థులు పాసయ్యారని, 28 మంది ఫెయిల్ అయ్యారని చెప్పారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సాధనల లిఖిత దుర్గ 586 మార్కులు, వి.అలేఖ్య 556, ద్వారపూడి శ్రీలక్ష్మి 554 మార్కులు సాధించారని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో అద్భుతంగా ఫలితాలు రావడంతో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె.నిర్మలాదేవి, ఫస్ట్ అసిస్టెంట్ కె.సుబ్బరాజు, స్టాఫ్ సెక్రటరీ మాణిక్యాలరావు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ద్వితీయ స్థానం 556/600 చిరంజీవి వాసే అలేఖ్య, తృతీయ స్థానం 554/600 చిరంజీవి ద్వారపూడి శ్రీలక్ష్మికి అభినందనలు తెలియజేశారు. టీచర్స్ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

భాష్యం విద్యార్థుల సత్తా

భీమవరం టౌన్ : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో భీమవరం భాష్యం స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని స్కూల్ ప్రిన్సిపల్ హనుమంత్ రావు, జోనల్ ఎడ్యుక్యూటివ్ ఆఫీసర్ శ్రీమాన్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. మేడపాటి శ్రేష్ట 595, మద్దల ఖ్యాతిశ్రీ 595, కొక్కిరిగడ్డ రితేష్ లార్సన్ 593, సంక వెంకట సాత్విక్ 593, అంగర మనోజ్ఞ, నిమ్మితి మరత అభిషేక్త 590 మార్కులతో ప్రతిభ కనబరిచారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

'ఆదిత్య' విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

నరసాపురం: 2025 మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నర్సాపురం ఆదిత్య స్కూలు విద్యార్థులు అత్యుత్తమ పతిభ కనబరిచారని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్లు ఎన్.శృతి రెడ్డి, ఎస్‌వి.రాఘవరెడ్డి తెలియజేశారు. 594 మార్కులతో కట్ట సాయిరత్న శ్రీవల్లి వర్షిణి ప్రథమస్థానం సాధించింది. 586 మార్కులతో రావూరి శ్రీనరసింహ గణేష్, 585 మార్కులతో సయ్యద్ ఫరీదా, 584 మార్కులతో దోసుల కరుణ, 582 మార్కులతో షేక్ సనా మెహలిన్, బొచ్చుల నాగశ్రీ, 581 మార్కులతో చాగంటి శరణ్య శ్రీలక్ష్మి హర్షిత తరవాతి స్థానాలలో నిలిచారని తెలియజేసారు.

ఆదిత్య హైస్కూల్ విజయభేరి

భీమవరం టౌన్ : పదో తరగతి ఫలితాలలో తమ విద్యార్థులు అత్యధిక ఫలితాలు సాధించి విజయ బేరి మోగించాలని ఆదిత్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ డాక్టర్ లయన్ కృష్ణంరాజు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన వారు ఎంఎస్ నాగ శివాని 587, ఎం.శర్వాణి 585, పిఎస్ఎస్‌వి.రామ్ నిహాల్ 585, రాఘవ శ్రీనిధి 584, ఎస్.దర్శన్ బాబు 584, వై.దక్షిణ్య 584, ఎం.అర్షియా 583, ఎన్.జనని 582, ఎం.వర్షిత 580, పి.హర్షవర్ధన్ రాజు అత్యంత మార్కులు సాధించారని, అలాగే 500కు పైగా 124 మంది విద్యార్థులు మార్కులు సాధించారన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 77 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - కాళ్ల

మండల పరిధిలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రయివేటు పాఠశాల విద్యార్థులు మొత్తం పదవ తరగతి విద్యార్థులు 674 మంది పరీక్షలు రాయగా 520 మంది విద్యార్థులు పాసై 77 శాతం ఉత్తీర్ణులైనట్లు కాళ్ల ఎంఇఒ ఎ.రవీంద్ర బుధవారం తెలిపారు. ఎంఇఒ రవీంద్ర పాఠశాల వారిగా ఉత్తీర్ణత శాతాన్ని వివరించారు. కాళ్ల హైస్కూల్ విద్యార్థులు 97 మంది పరీక్షలు రాయగా 87 మంది ఉత్తీర్ణులయ్యారు. 90 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. నిమ్మల యశస్విని 586 మార్కులు సాధించి మండలం ఫస్ట్ సాధించింది. కోపల్లె హైస్కూల్ విద్యార్థులు 118 మంది పరీక్షలు రాయగా 90 మంది ఉత్తీర్ణులయ్యారు. 76 ఉత్తీర్ణత శాతం సాధించారు. సాధనాల లిఖిత దుర్గ 586 మార్కులు సాధించి మండలం ఫస్ట్ సాధించింది. దొడ్డనపూడి హైస్కూల్ విద్యార్థులు 41 మంది పరీక్ష రాయగా 37 మంది పాసయ్యారు. 90 శాతం ఉత్తీర్ణత సాధించారు. బొండాడ హైస్కూల్ విద్యార్థులు 80 మంది పరీక్షలు రాయగా విద్యార్థులు 59 మంది పాసయ్యారు. 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏలూరుపాడు హైస్కూల్లో 66 మంది పరీక్ష రాయగా 26 మంది పాసయ్యారు. 31 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీసలి హైస్కూల్ పదోతరగతి పరీక్షల్లో 72 మంది పరీక్ష రాయగా 63 మంది పాసయ్యారు. 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. కలవపూడి హైస్కూల్ విద్యార్థులు 56 మంది పరీక్షలు రాయగా 49 మంది పాసయ్యారు. 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. జువ్వలపాలెం హైస్కూల్ విద్యార్థులు 30 మంది పరీక్షలు రాయగా 10 మంది పాసయ్యారు. 20 మంది ఉత్తీర్ణత కాలేదు. 38 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏలూరుపాడు గ్రామంలో జ్ఞానానంద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో పదో తరగతి విద్యార్థులు 67 మంది పరీక్షలు రాయగా 59 మంది పాసయ్యారు. 88 శాతం ఉత్తీర్ణత సాధించారు. మాలవానితిప్ప హైస్కూల్లో 29 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 28 మంది పాసయ్యారు. 97శాతం ఉత్తీర్ణత సాధించారు. కెవికె రాజు విద్య నికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థులు 18 మంది పదో తరగతి పరీక్షలు రాయగా 18 మంది పాస్ అయ్యారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ ఎ.రవీంద్ర వివరించారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు

ఉండి : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలానికి చెందిన ఇండియన్ డిజిటల్ స్కూల్ విద్యార్థిని కలిశెట్టి ప్రభాస్ 590 మార్కులతో మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలోని ఇండియన్ డిజిటల్ స్కూల్ 92 శాతం, గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 92 శాతం, చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ 98 శాతం ఫలితాలను సాధించగా శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 85 శాతం ఫలితాలు సాధించింది. ప్రభుత్వ పాఠశాలలు ఈ సంవత్సరం ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన ర్యాంకులు సాధించడం విశేషం. ఉండి శశి హై స్కూల్ 32 మంది విద్యార్థులకు 27 మంది, ఎండగండి చైతన్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 46 మంది విద్యార్థులకు 45 మంది, ఇండియన్ డిజిటల్ స్కూల్ 47 మంది విద్యార్థులకు 43 మంది, గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 24 మంది విద్యార్థులకు 22 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండి హైస్కూల్ 134 విద్యార్థులకు 101 మంది, ఎన్ఆర్‌పి అగ్రహారం హైస్కూల్ 36 మంది విద్యార్థులకు 24 మంది, కోలమూరు హై స్కూల్ 21 మందికి 20 మంది, ఉప్పులూరు హైస్కూల్ 26 మందికి 12 మంది, మహదేవపట్నం హైస్కూల్ 85 మందికి 50 మంది, ఉనుదుర్రు హై స్కూల్ 13 మందికి 8 మంది, చెరుకువాడ హై స్కూల్ 75 మందికి 63 మంది, ఎండగండి హై స్కూల్ 60 మందికి 47 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 449 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 325 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 72 శాతం ఉత్తీర్ణత సాధించగా, ప్రయివేట్ విద్యా సంస్థల్లో 149 మంది విద్యార్థులకు 137 మంది ఉత్తీర్ణులై 92 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులలో కోలమూరు హై స్కూల్ విద్యార్థి సుంకర తేజశ్రీ 585, ఎండగండి హై స్కూల్ విద్యార్థిని జాహ్నవి వెంకట ప్రసన్నలక్ష్మి 571 మార్కులు, ఎన్ఆర్‌పి అగ్రహారం హై స్కూల్ విద్యార్థి కె.ప్రసాద్ 562 మార్కులు, ఉప్పులూరు హై స్కూల్ విద్యార్థి జె.వరప్రసాద్ 562 మార్కులు, ఉండి హై స్కూల్ విద్యార్థి గ్రంధి లక్ష్మీనారాయణ 559 మార్కులు సాధించి ప్రయివేట్ పాఠశాలలకు పోటీగా నిలిచారని ఎంఇఒ జ్యోతి తెలిపారు. ఈ సంవత్సరం మండల స్థాయిలో ఎండగండి చైతన్య స్కూల్ విద్యార్థిని సత్తినీడి నాగసాయి 584 మార్కులు సాధించారన్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలో పోటీగా నిలవగా మరికొన్ని ప్రభుత్వ పాఠశాలలు దారుణమైన ఫలితాలను చవిచూసాయని అన్నారు.


ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

మెరిసిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

ఆచంట : ఈ ఏడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ హైస్కూల్లో చదివిన పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. మండలంలోని వల్లూరు ఎంపీ పాలెం జెడ్‌పియుపి విద్యార్థిని పిఎస్.శ్రీలేఖ 583 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలవగా, కొడమంచిలి హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌కి చెందిన పుచ్చకాయల శారణ్య 581 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానం సాధించింది. ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కరుగోరుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.యువరాజు, వై.జయస్ గణపతి ఇద్దరు విద్యార్థులు 577 మార్కులతో మండలంలో తృతీయ స్థానాలు సాధించారు. మండలం మొత్తం 81 శాతంతో పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం పట్ల ఎంఇఒలు ఎ.ఉషారాణి, పి.రాజేంద్రప్రసాద్‌లు విద్యార్థులను అభినందించారు. ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 105 మంది విద్యార్థులకు గాను 102 మంది విద్యార్థులు 97 శాతంతో విజయం సాధించారు. ఆచంట వేమవరంలో 59 మంది విద్యార్థులకు గాను 50 మంది విద్యార్థులు 85 శాతం సాధించారు. కొడమంచిలి జిల్లా పరిషత్ హై స్కూల్‌కి చెందిన 73 విద్యార్థులు గాను 43 విద్యార్థులు 59 శాతం సాధించారు. వల్లూరు ఎంపీ పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన 80 విద్యార్థులు గాను 62 మందితో 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. కరుగోరుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థులకు గాను 30 మంది విద్యార్థులు 94 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. భీమలాపురంలో 36 మంది విద్యార్థులకు గాను 21 మంది విద్యార్థులు 58 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. పెనుమంచిలిలో 35 మంది విద్యార్థులకు గాను 23 మంది విద్యార్థులు 66 శాతం ఉత్తీర్ణత సాధించారు. కోడేరులో 26 మంది విద్యార్థులకు గాను 21 మంది విద్యార్థులు 81 శాతంతో ఉత్తీర్ణత సాధించారు. ఆచంట స్మైక్ ఇంగ్లీష్ మీడియం 10కి 10 మంది విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. కొడమంచిలి హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియంకు చెందిన 46 మంది విద్యార్థులకు గాను 45 మంది విద్యార్థులు 98 శాతంతో ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ తెలిపారు.



పిఎస్.శ్రీలేఖ, పి.శారణ్య


ప్రభుత్వ పాఠశాలల్లో 76 శాతం ఉత్తీర్ణత

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో ఉన్న పది జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లోని పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 428 మంది విద్యార్థులకు 326(76 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ తెలిపారు. శేరేపాలెం నిప్పులేటి కనకరత్నం తాతయ్య నాయుడు జట్టు పాఠశాలలో 30 మంది విద్యార్థులకు 21(70 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. పాఠశాల ప్రథమ స్థానంలో ఎంఎస్‌డిఎల్.సౌజన్య, దొంగ ప్రణతిలు 559 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. విప్పలవారి తోటలోని ఉన్నత పాఠశాలలో 45 మంది విద్యార్థులకు 25(56 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, పాఠశాల ప్రథమ స్థానంలో కడలి ఓంసాయి మణికంఠ 550 మార్కులు సాధించారని తెలిపారు. పాతపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 19 మంది విద్యార్థులకు 14(74 శాతం) మంది విద్యార్థులు ఉత్తీరణత సాధించారని, పాఠశాల టాపర్‌గా రేవు మౌనిక 561 మార్కులు సాధించారన్నారు. ముత్యాలపల్లిలో 159 మంది విద్యార్థులకు 128 మంది విద్యార్థులు 81 శాతం సాధించారని, పాఠశాల ప్రథమ స్థానంలో బైనపాలెం చంద్రశేఖర్ 571 మార్కులు(మండలం ద్వితీయ స్థానం సాధించారన్నారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల 86/46 విద్యార్థులు 53 శాతం సాధించారు. పాఠశాల టాపర్‌గా కొప్పనాతి శ్రీవల్లి 548 మార్కులు సాధించారు. జగన్నాధపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 30/19 విద్యార్థులు 63 శాతం సాధించారని, సిహెచ్.వెంకటేష్ 517 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచారన్నారు. నీటి తిప్పలని జట్టు పాఠశాలలో 16/11 మంది విద్యార్థులకు 69 శాతం సాధించారని, పాఠశాల ప్రథమ స్థానంలో పి.గాయత్రి కుమారి 493 మార్కులు సాధించారన్నారు. కాళీపట్నంలోని పాఠశాలలో 33/26 మంది విద్యార్థులు 79 శాతం సాధించారని. పాఠశాల టాపర్‌గా వాతాడ వైశాలి 553 మార్కులు సాధించారన్నారు. పేరుపాలెంలోని కొమ్మూరు సతీష్ జెడ్‌పి ఉన్నత పాఠశాల 59/38 విద్యార్థులు 66 శాతం సాధించారని, గుత్తుల వాసవి పెద్దిలక్ష్మి 577 మార్కులు(మండలం ప్రథమ స్థానం) సాధించారని తెలిపారు. కేపీ పాలెం జట్టు ఉన్నత పాఠశాలలో 67/44 విద్యార్థులు 66 శాతం సాధించారని, వీరమల్లు ఝాన్సీ ధాత్రిశ్రీ 562 మార్కులతో మండల తృతీయ స్థానంలో నిలిచారని ఎంఇఒ తెలిపారు.

ప్రయివేట్ పాఠశాలలు వెంద్ర హారిక 595(కాళీపట్నంలోని సెయింట్ మేరీస్), అందే లీలా మాధురి 588(మొగల్తూరులోని వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల), కొల్లాటి చైతన్యశ్రీ 573 (మొగల్తూరులోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

ఆకివీడులో 83.06 శాతం ఉత్తీర్ణత

ఆకివీడు : ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మహిళల్లో 83.06 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో ప్రభుత్వ పాఠశాల నుంచి 503 మంది పరీక్షలకు హాజరుకాగా 391 మంది ఉత్తీర్ణులయ్యారు. 78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక ప్రయివేట్ పాఠశాలల నుంచి 362 మంది పరీక్షలకు హాజరుకాగా 356 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 98.3 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలలకు గాను ఆకివీడు జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌కి చెందిన కె.శాన్వి 590 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక సిద్దాపురం జెడ్‌పి హైస్కూల్‌కి చెందిన వి.ప్రభాకర్ 587 మార్కులు, ఆకివీడు బాలుర హై స్కూల్‌కు చెందిన మణికంఠ 583 మార్కులతో ప్రభుత్వ పాఠశాలలో రెండు, మూడు స్థానాలు పొందారు. కాగా కార్పొరేట్ పాఠశాల నారాయణ హై స్కూల్ విద్యార్థి 594 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించారు. ఇక స్థానిక పాఠశాలలో విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థి బుంగ హన్షిత 592 మార్కులతో స్థానికంగా ప్రథమ స్థానం, మండలంలో ద్వితీయ స్థానం సాధించింది. సాధారణ స్థాయి పాఠశాలలో ఇదే అత్యుత్తమమైన మార్కులు. ఇక శారద ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థి కొల్లాటి కోమలి 590 మార్కులు, ఆదిత్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌కు చెందిన పేకేటి ఖ్యాతి ప్రియాంక 590 మార్కులు సాధించింది. వీరందరూ ఆయా పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఒకే ఒక్క ప్రయివేట్ హై స్కూల్ చిన్న కాపవరంలోని శ్రీవిద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నుంచి వై.దాని భార్గవి 574 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానం సాధించింది. జెడ్‌పి బాలుర హైస్కూల్ ఫలితాలు 70 శాతంగా నమోదయ్యాయి.


కె.శాన్వి

విశ్వకవి విజయకేతనం

భీమవరం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు అత్యధిక మార్కులతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని విశ్వ కవి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పొట్నూరి రఘుబాబు తెలిపారు. 500 మార్కులకుపైగా 18 మంది విద్యార్థులు సాధించారన్నారు. స్కూల్ వద్ద విద్యార్థులను అభినందించి వారికి బహుమతి చెక్కులను అందజేశారు. సిబ్బంది అభినందించారు.

శశి హోలీ ఏంజెల్స్‌లో నూరు శాతం ఉత్తీర్ణత

భీమవరం టౌన్ : పది పరీక్ష ఫలితాల్లో తమ స్కూలు విద్యార్థులు అత్యధిక మార్కులతో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని శశి హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం తెలిపింది. స్కూల్ ఫస్ట్ ఎం.నిహారిక 563, స్కూల్ సెకండ్ జి.సందీప్ 551, స్కూల్ థర్డ్ ఆర్.శిరీష 549 మార్కులు సాధించారన్నారు. వారిని స్కూల్ అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

జెడ్‌పి విద్యార్థుల ప్రతిభ

తణుకు : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పడాల కావ్యశ్రీ 587 మార్కులు, కె.తన్మయిప్రియ 580, పాలాటి వర్షిణి, తిరుపతిపాటి శ్రీవల్లిలు 578 మార్కులు సాధించారని పాఠశాల హెచ్ఎం కె.పద్మావతి తెలియజేశారు. వారిని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ తన క్యాంపు కార్యాలయం వద్ద ఘనంగా సత్కరించారు.